# కథ

-తాడిమేటి శ్రీదేవి


**"మనవాడికి గవర్నమెంట్ కాలేజీలో చేరడం యిష్టం లేదంటున్నాడండీ" అరుణ పళ్ళెంలో బియ్యం ఏరుతూ నెమ్మదిగా అంది.**

**"ఇష్టం లేదంటే నేనేం చెయ్యను? వేలకి వేలు పోసి కార్పొరేట్ కాలేజీల్లో చేర్పించగలమా? అయినా ఇంటర్‌తో చదువు అయిపోదు కదా. దీనికే యింత ఖర్చయితే ముందు ముందు ఎలా తట్టుకోవాలి?" విసుగు, నిస్సహాయత ఆనందరావు గొంతులో ప్రతిధ్వనించాయి.**

''నిజమేననుకోండి. వీడికి టెన్త్‌లో 520 మార్కులు వచ్చాయి కదా. ఐదు వందల మార్కులు దాటినవారికి కన్సెషన్ కూడా యిస్తారంటున్నారు కదా'' అరుణ ఒప్పిద్దామనే ప్రయత్నం మొదలెట్టింది. ఆమెకు కొడుకు మొహం కళ్ళముందు కదిలింది. 'సరైన కోచింగ్ లేకపోతే ఎమ్‌సెట్ ఫేస్ చెయ్యలేమమ్మా' అంటూ నిరాశపడిన వాడి మాటలు ఆమెకు కడుపు తరుక్కుపోయేలా చేసాయి. ఎలాగో పొదుపుచేసి కష్టపడి పిల్లవాడ్ని పెద్ద చదువులు చదివించాలనేది మధ్యతరగతి కుటుంబీకులైన వాళ్ళ యిద్దరి ఆలోచన. పిల్లల చదువుల కోసం వాళ్ళు దేన్నైనా వదులుకోవడానికి సిద్ధమే. కానీ ధరలు మండిపోతున్న ఈరోజుల్లో ఎంత జాగ్రత్తపడ్డా కటకట పడడం మామూలయిపోయింది. కిరణ్ తర్వాత సంధ్యను కూడా చదివించుకోవాలి. ఇవన్నీ అరుణకు తెలియని విషయాలు కావు. కానీ ఎలాగో కష్టపడి పిల్లలకు మంచిచదువు అందివ్వాలని, అదే వాళ్ళకి మనమిచ్చే ఆస్తి అనీ ఆమె నమ్మకం. అందుకే పట్టువదలని విక్రమార్కురాలిలా భర్తను పదే పదే అడుగుతోంది.

''నాకు మటుకు వాడు మంచి చదువు చదువుకోవాలని ఉండదా? మనం ఎంతవరకు చెయ్యగలమని ఆలోచించకుండా దిగితే ఎలాగని గానీ'' ఆనందరావు ఈసారి కొంచెం మెత్తబడ్డాడు.

''అవుననుకోండి అసలు ఫీజులవీ ఎలా వుంటాయో ఏమిటో కనుక్కోండి. మనం యిదే వూర్లో వుంటున్నాం కాబట్టి హాస్టల్లో పెట్టక్కర్లేదు. ప్రొద్దున్నే లేచి ఏడు గంటలకల్లా క్యారియరు సిద్ధం చేసేస్తాను. వాయిదాల మీద ప్లాటు కొందామనుకున్నాం కదా. ముందు అవన్నీ ప్రక్కకి పెట్టి పిల్లాడి చదువు సంగతి చూద్దాం'' గబ గబా అంది అరుణ.



## వలలో పడని పక్షులు

''సర్లే'' టవల్ తీసుకుని స్నానానికి బయల్దేరాడు ఆనందరావు. ప్రక్కగదిలో చెల్లెలికి లెక్కల్లో డౌట్లు తీరుస్తున్న కిరణ్ ఆనందానికి అంతులేదు. ''అమ్మా!'' అంటూ వచ్చి తల్లిని చుట్టేసాడు.

''ఏంట్రా వెర్రివెధవా?'' అంటూ వాడి బుగ్గలు సాగదీసింది అరుణ. ''చక్కగా చదువుకోవాలి మరి'' కొంచెం గంభీరంగా చెప్పింది.

''తప్పకుండానమ్మా. నువ్వే చూస్తావుగా! ఒక్కసారి అశోక్ యింటికి వెళ్ళొస్తాను. అరగంటలో వచ్చేస్తాను''. సమాధానానికి ఎదురు చూడకుండా వీధిలోకి పరుగుతీసాడు కిరణ్.

అశోక్, కిరణ్, రంగా మంచి స్నేహితులు. అశోక్ బొటాబొటీ ఫస్ట్‌క్లాస్ మార్కులతో ప్యాస్ అయ్యాడు. కానీ వాళ్ళ నాన్నగారు బిజినెస్‌లో బాగా సంపాదిస్తూండడం వల్ల ఫీజు కట్టడం పెద్ద సమస్య కాదు. కిరణ్, రంగాలే ఆలోచించాల్సిన పరిస్థితి. రంగాని ఏమన్నారో వాళ్ళ నాన్నగారు. దారిలో రంగా యింటి దగ్గర ఆగాడు కిరణ్. రంగా పిలవగానే రాలేదు. కాసేపటికి వచ్చాడు. వాడి కళ్ళు ఎర్రగా ఉబ్బి ఉన్నాయి. ''నాన్నగారు చదివించలేనంటున్నార్రా..గవర్నమెంట్ కాలేజీలో చేర్పించడమే కష్టం అంటున్నారు. అలా చేరకపోతే మొత్తం చదువే మానేసి పౌరోహిత్యం నేర్చుకోమంటున్నారు. నువ్వు, అశోక్ చేరండి'' తనకు దక్కలేదనే నిరాశ వాడి మొహంలో స్పష్టంగా కనిపిస్తోంది.

కిరణ్‌కి కూడా ఆర్థిక యిబ్బందులెలా వుంటాయో తెలుసుకాబట్టి మాట్లాడలేకపోయాడు. నాన్నగారు ఒప్పుకోకపోతే నా పరిస్థితీ యింతేకదా అనుకున్నాడు. ''పోన్లే రంగా! బాధపడకు. ఈమధ్యన గవర్నమెంట్ కాలేజీల్లో కూడా టెస్టులు అవీ పెట్టి బాగా చెప్తున్నారంటున్నారు కదా. మీరందరూ కార్పొరేట్ కాలేజీకి ఎగబడక్కర్లేదు. శ్రద్ధగా చదువుకుంటే మామూలు కాలేజీలే ఎంతో నయమని మన వెంకట్రావు సార్ కూడా అన్నారు కదా. అందరం యిక్కడే వుంటాం కాబట్టి కలిసి చదువుకుందాం'' తనకి చేతనైనట్లు రంగాని ఓదార్చాడు కిరణ్.

అక్కడి నుంచి అశోక్ యింటికి వెళ్ళి తన సంగతి, రంగా సంగతి చెప్పాడు. ''వాడు కూడా చేరితే బావుండేదిరా సరే ఏం చేస్తాం. మనకి వీలున్నప్పుడల్లా వాడ్ని కలుస్తూ వుందాం. ఇదిగో ఈ స్వీట్ తీసుకో'' అంటూ పాలకోవా ప్యాకెట్టు కిరణ్ ముందుకి జాపాడు అశోక్.

మర్నాడు కాలేజీకి బయలుదేరాడు కిరణ్, ఆనందరావు. కిరణ్‌కి ఎంతో ఆనందంగా వున్నా వాళ్ళ నాన్నతో యిదివరకటిలా ఫ్రీగా మాట్లాడలేకపోతున్నాడు. తన చదువువల్ల తల్లిదండ్రుల మీద ఎంతో భారం మోపుతున్నాననే గిల్టీఫీలింగ్ మనసులో మెదుల్తూనే వుంది. అశోక్‌ని తీసుకువస్తూ వాళ్ళ నాన్నగారు కమలాకరరావుగారు ఎదురయ్యారు. అందరూ కలిసి కాలేజీకి వెళ్ళారు.

డైరక్టరుగారు పనిమీద బయటకి వెళ్ళారని యింకో గంట పడుతుంది, వెయిట్ చెయ్యమని ప్యూన్ చెప్పాడు. ఎంతో వినయంగా ఆహ్వానించి కూర్చోబెట్టాడు. ''నేను అరగంటలో వస్తాను, ఆఫీస్‌లో పుటప్ చేయాల్సిన ఫైలు వుంది'' అన్నాడు ఆనందరావు. ''నేనూ చిన్న పని చూసుకుని వస్తాను'' అన్నాడు కమలాకరరావు. పిల్లలిద్దర్నీ కూర్చోమని తండ్రులు బయటకు వెళ్ళారు. అశోక్, కిరణ్‌లకు కాలేజి విపరీతంగా నచ్చేసింది. మెత్తటి సోఫాలలో కూర్చుని అక్కడ చదువుకుని జీవితంలో ఎంతో ఎత్తుకు ఎదిగినట్లు కలలు కనడం మొదలుపెట్టారు. ఇంతలో నీట్‌గా టక్ చేసుకుని, టై కట్టుకుని హుందాగా ఒకాయన రావడం, వీళ్ళు విష్ చేయగానే తల పంకిస్తూ చక్కగా నవ్వడం జరిగాయి.

ఆయన లోపలకు వెళ్ళగానే డోర్ మూసుకుపోయింది. ఆయన దర్జా, దర్పం చూసి పిల్లలిద్దరూ ఫ్లాట్ అయిపోయారు.

''ఆయనేరా డైరక్టర్. చాలా తెలివైన ఆయనట'' గుస గుసలాడుకున్నారు. ఇంతలో ప్యూన్ ట్రేలో మంచినీళ్ళగ్లాసు మూతపెట్టి తీసుకువచ్చాడు. ఎంతో వినయంగా తలుపు తట్టి లోపల పెట్టి వచ్చాడు. అతను బయటకు వస్తుండగా క్లర్క్ ఎవరో పిలవడం జరిగింది. డోర్ పూర్తిగా మూయడం మానేసి అతను హడావుడిగా వెళ్ళిపోయాడు.

''నేను వెళ్ళి వేస్తానురా'' అన్నాడు కిరణ్. అక్కడ అన్నీ పద్ధతి ప్రకారం జరుగుతుంటే ఆ చిన్న విషయం కూడా యింకోలా జరగడం అతనికి నచ్చలేదు.


''ఎందుకు లేరా. మళ్ళీ వచ్చినప్పుడు ప్యూనే వేసుకుంటాడులే'' అన్నాడు అశోక్.

''అయినా అదేం తెరిచినట్లు లేదుగా, కొంచెం అంతేగా'' అని కూడా అన్నాడు.

## నెగటివ్ పాత్రల్లో తనుశ్రీ

**హీరోలుగా విజయం అందని వాళ్ళు విలన్‌లుగానూ, హీరోయిన్లుగా సక్సెస్ అందుకోలేని వాళ్ళు నెగటివ్ పాత్రల వైపు దృష్టి మళ్ళిస్తుంటారు. తాజాగా ఈ లిస్టులోకి జార్ఖండ్ సుందరి తనుశ్రీ దత్తా చేరింది. ఇటీవల వచ్చిన 'గుడ్‌బాయ్ బాడ్‌బాయ్' సినిమాలో బాడ్‌గాళ్‌గా నటించిన తనుశ్రీ మరో కొత్త సినిమా 'రఖీబ్'లో కూడా నెగటివ్ టచ్ వున్న కేరక్టర్‌ని పోషిస్తోందిట. నటన అన్నాక అన్ని రకాల పాత్రల్నీ పోషించి మెప్పించాలి కదా అంటుంది గడుసుగా తనుశ్రీ.**






అయినా కిరణ్ మనసు వూరుకోలేదు. వేద్దామని లేస్తుంటే డైరక్టర్ గారి రూమ్‌లో ఫోన్ రింగయ్యింది. ఆ సంభాషణ అనుకోకుండా వీళ్ళ చెవులకి చేరుతోంది.

''ఏంటి మధూ? ఏమంటున్నావు? ఆ స్టేట్ ఫస్ట్ తెచ్చుకున్న అమర్‌ని ఎలాగైనా మన కాలేజీలో చేర్పించమన్నాను కదా. తల్లిదండ్రులు ఒప్పుకోవడం లేదా? ఫీజ్ కట్టక్కర్లేదని చెప్పు. హాస్టల్ క్కూడా కన్సెషన్ యిస్తామని చెప్పి ఎలాగోలా ఒప్పించు. మనకేం లాభమంటావా? ఎంత వెర్రివాడిలా మాట్లాడుతున్నావయ్యా? అటువంటి పిల్లల వల్ల మన కాలేజీకి ఎంత పేరు వస్తుందో తెలుసా? రేపువాడు ఇంటర్‌లో కూడా స్టేట్‌ర్యాంక్ తెచ్చుకుంటే ఆ క్రెడిట్ ఎవరికి? వాడు ఫీజు కట్టకపోతేయేం? వాడినిబట్టి ఎంతోమంది వచ్చి చేరతారు. తెలివైన వాళ్ళని స్టార్ బ్యాచ్‌లో వేసి, మంచి లెక్చరర్ల చేత కోచింగ్ యిప్పిస్తాము. వాళ్ళే మన పేరు నిలబెట్టే వాళ్ళు. పేపర్‌లో ఫోటోలు వేయించుకునే వాళ్ళూను. మిగిలిన వాళ్ళని నైన్ టు సిక్స్ కదలకుండా బంధించి చదివిస్తాం. ఎవరైనా తెలివిగా కనిపిస్తే స్టార్ బ్యాచ్‌కి వెళ్తారు. మిగిలిన వాళ్ళు కట్టే ఫీజులు మన బిల్డింగ్స్‌కు, ల్యాబ్‌లకీ, లైబ్రరీలకూ ఉపయోగపడతాయి. డబ్బుకి వీళ్ళూ, పేరుకి వాళ్ళూ హ! హ!'' నవ్వుతూ డైరెక్టర్‌గారు మాట్లాడుతున్న మాటలన్నీ అశోక్, కిరణ్‌లకి స్పష్టంగా వినబడ్డాయి.

ఇద్దరూ ఒకళ్ళ మొహాలు ఒకళ్ళు చూసుకున్నారు. అక్కడి నుంచి వెంటనే బయటకు వచ్చేసారు. ఫ్యూన్ ఏదో చెప్తున్నా వినిపించుకోలేదు. రోడ్డుమీద తండ్రుల కోసం ఎదురుచూడసాగారు.

''ఎంత అన్యాయం! నాన్నగారు అంత ఫీజు కట్టుకోలేమే- అంటుంటే అమ్మ ఒప్పించింది. అంటే ఈ కాలేజీకి బాగా పేరుంది కాబట్టి మంచి మార్కులు వచ్చిన ఎంతో మంది చేరతారు. ఐదు వందల యాభై అలా వచ్చిన వాళ్ళకి ప్రత్యేకమైన కోచింగ్‌లు వుంటాయన్న మాట. నన్ను దానిక్రింది సెక్షన్‌లోనూ, నిన్ను బహుశా ఆ తరువాత సెక్షన్‌లోనూ వేస్తారు. చూసే వాళ్ళకి ఎంతో గొప్పగా, తెలివిగా విడదీసినట్లు కనిపిస్తుంది. కానీ ఎప్పుడూ స్టార్ బ్యాచ్‌కే మంచి కోచింగ్ అందుతూ వుంటుంది. ప్రొద్దున్నుంచి సాయంత్రం వరకు కదలకుండా చదవడం మనం యింటి దగ్గరే చెయ్యచ్చు కదా'' అన్నాడు కిరణ్.

''అవును. దీన్నిబట్టి వెంకట్రావు సార్ చెప్పింది ఎంతో నిజమనిపిస్తోంది. మామూలు కాలేజీలు కూడా మంచివేనని ఆయనన్న మాట ఎంతో నిజం'' ఆలోచనగా అన్నాడు అశోక్.

''మన తల్లిదండ్రులు కష్టపడి సంపాదించేది మన భవిష్యత్తు బావుండాలని గానీ వీళ్ళ జేబులు నింపడానికి కాదుగా?'' ఆవేశంతో కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి కిరణ్‌కి.

''పేపర్లలో అడ్వర్టైజ్‌మెంట్లు చూసి మోసపోయాము. సామాన్యమైన తెలివితేటలున్న వాళ్ళని సానబట్టి వజ్రాల్లా చేస్తారనుకున్నాము. కానీ వజ్రాలకే యింకొంచెం మెరుగులు దిద్దుతున్నారన్న మాట'' ఎకసెక్కంగా అన్నాడు అశోక్.

వీళ్ళిలా మాట్లాడుకుంటూ వుండగానే ఆనందరావు, కమలాకరరావులు వచ్చేసారు. ''ఏంట్రా లోపల కూర్చోకుండా బయటకు వచ్చేసారు?'' అంటూ.

''మేమిద్దరం మన వూర్లో వున్న గవర్నమెంట్ కాలేజీలో చేరతాం'' ముక్తకంఠంతో చెప్పారు మిత్రులిద్దరూ.

''అదేంటి?'' విస్తుపోయారు తండ్రులు. వాళ్ళ చేతులు పట్టుకుని నడుస్తూ జరిగినదంతా చెప్తున్న కొడుకుల్ని చూస్తూ వాళ్ళ నిర్ణయాన్ని మనసారాగా అభినందించారు వారు.

రెండేళ్ళు శ్రద్ధగా చదివి కార్పొరేట్ కాలేజీ కుర్రాళ్ళకి తీసిపోని విధంగా మార్కులు తెచ్చుకున్న సుపుత్రులని చూసుకున్న వారి పేరెంట్స్ మొహాల్లో గర్వరేఖలు పొడజూపాయి.

☆

## భర్త కోసం....!

**పెళ్లి తర్వాత సినిమాల్లో కనిపించడం మానేసిన రాశి భర్త శ్రీనివాస్ గతంలో కొన్ని చిత్రాలకు అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేశాడు. దర్శకుడు కావాలన్నదే అతని ఆకాంక్ష. ఆయనదేంటి? ఇప్పుడు రాశి ఆకాంక్ష కూడా. అందుకనే శ్రీనివాస్ డైరెక్టర్‌గా అవకాశం రావడంతోనే ఆ సినిమా ఎలాగైనా నిర్మాణమై రిలీజ్ కావాలని కోరుకుంటున్న రాశి- ఈ సినిమాకి కొంత పెట్టుబడి కూడా పెడుతోందని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. దాదాపు 1.75 కోట్ల వ్యయంతో నిర్మాణం కానున్న ఈ సినిమా ఖర్చులో సుమారు 65 లక్షల వరకూ రాశి ఖర్చు చేయడానికి సిద్ధమైందట. రిషీ-ఫర్జానా జంటగా నటించే ఈ సినిమా మరి రాశి భర్తకి డైరెక్టర్‌గా ఎలాంటి గుర్తింపు తెస్తుందో!**

